# నాగరీకము

వెంకటేశ్వర్లు మలకాపురము నుంచి సైకిలుమీద లేడీడాక్టరు కొరకు టౌనులోనికి వచ్చాడు. అతడి భార్య శకుంతల గత రాత్రినుండీ ప్రసవవేదన పడుతున్నది. ఇంట్లో ఉన్నవాళ్ళందరూ ఆతురత కొద్దీ తలకొక మాటా అంటున్నారు. కొందరు ఆసుపత్రికి తీసుకొని వెళ్ళితే మంచిదంటున్నారు. ఎంతడబ్బు ఖర్చు అయినా డాక్టరును ఇంటికి తీసుకొనివస్తే మంచిదంటున్నారు కొందరు. వెంకటేశ్వర్లకు ఎటూ తోచక-ఎంత ఖర్చు అయినా వైద్యురాలిని ఇంటికి తీసుకొని వెళ్ళితేనే మంచిదేమోనని టౌనుకు వచ్చాడు.

డాక్టరు పంకజవల్లీశర్మ మంచి హస్తవాసి గల వైద్యురాలు. కానుపు కేసులలో ఇంతవరకూ ఆమెకు అపజయమన్నది లేదు. ఆమె పేరు గ్రామ గ్రామాలలో ప్రాకి పోయింది. నాలుగు సంవత్సరాల క్రిందట నేత్రవైద్యములో ప్రవీణుడైన రామశర్మను వివాహము చేసుకొన్నది. డాక్టరు పంకజవల్లీశర్మ అంటే అక్కడి మహిళామణుల కందరికీ ఎంతో అభిమానము. విద్యా

వంతు రాలనీ-విజ్ఞానవంతురాలనీ, వైద్యములో సాటిలేని ప్రజ్ఞ కలదనీ ఆమె నొక దేవతగా భావించేవారు. అక్కడ మహిళా సంఘము పక్షమున స్థాపించబడిన ఫ్యామిలీ ప్లానింగు సెంటర్లలో వారానికి రెండు పర్యాయములు ఉపన్యసించ వలసినదని ఎంత గానో ప్రాధేయపడి ఆమెను ఏర్పాటు చేసుకొన్నారు.

ఉపన్యాసాలు విన్నవారు ఆమె వచో మాధుర్యానికీ - విషయవైశద్యానికీ సమ్మోహితులై పోయేవారు.

ఆమె ఉపన్యాసాలను గురించి ఎప్పటి కప్పుడు వెంక టేశ్వర్లూ శకుంతలా పత్రికలలో చదువుతూ ఉండేవారు. టౌను లోనికి రాగానే వెంకటేశ్వర్లకు డాక్టరు పంకజవల్లీశర్మ పేరు తటాలున జ్ఞాపకమువచ్చి ఆమె యింటికి వెళ్ళాడు. ఆమె ఏదో పనిమీద బైటికి వెళ్ళినదనీ ఒక గంట సేపటిలో వస్తుందనీ తెలిసింది.

ఉదయము తొమ్మిది గంటలకు ఇంటి నుంచి బయలు దేరాడు వెంకటేశ్వర్లు. అప్పుడే పదకొండు గంటలు దాటిపోయి నాయి. అతడిని ఆకలి ఒక ప్రక్కనా-శకుంతలను గురించిన ఆతురత ఒక ప్రక్కనా వేధించ నారంభించినవి. ఇంకొక గంట అంటే పన్నెండు గంటలు దాటితేనే గాని డాక్టరు దురా !

డాక్టరు వచ్చేవరకూ క్షణమొక యుగముగా లెక్కించు కుంటూ—వాకిటి వరండాలో పచారు చేయటము మొదలు పెట్టాడు వెంకటేశ్వర్లు.

సుమారు ఒంటిగంటకు డాక్టరు పంకజవల్లీశర్మ కారు పోర్టికోలోకి వచ్చి ఆగింది. ఆమె కారు దిగుతుండగానే ఎదురుగా

వెళ్ళి తన సంగతిని చెప్పుకున్నాడు వెంకటేశ్వర్లు. ఒక అర గంటలో వస్తానని ఆమెలోపలికి వెళ్ళింది.

అరగంట-ముప్పావు గంట గడచిపోయినది గాని వైద్యు రాలు బయటకు రాలేదు.

భార్యను గురించి ఆందోళన పడుతున్న వెంకటేశ్వర్లకు ఆమె చేస్తున్న ఆలస్యానికి విసుగుపుట్టుతున్నది. కాని మరొక సారి ఆమెను పిలిచి తొందరపెట్టితే 'పల్లెటూరి వాడని' అంటుందేమోనని భయపడి తలుపు దగ్గరగా గోడకు ఆనుకొని నిలువబడ్డాడు వెంకటేశ్వర్లు.

లోపలినుంచి ఏవో మాటలు వెంకటేశ్వర్లకు అస్పష్ట ముగా వినుపించాయి.

"నేను ఆలస్యముగా వచ్చానని కోపము వచ్చిందా?... ఆఁ ?...ఎందుకూ అంత కోపము?" ఎంతో బుజ్జగిస్తున్నట్లుగా-బ్రతిమిలాడు తున్నట్లుగా ఉన్నది కంఠధ్వని. ఆ ధ్వని డాక్టరు పంకజవల్లీశర్మది.

కోపము వచ్చిన భర్తను బ్రతిమిలాడు తున్నది కాబోలు-ఆమె ఎంతటి విద్యావతి అయినా-ఎంతడబ్బు సంపాదించి పేరు తెచ్చుకుంటున్నా-భర్తను బ్రతిమిలాడుకొని ప్రాధేయ పడటము స్త్రీకి తప్పదుకదా అనుకున్నాడు వెంకటేశ్వర్లు. 'విక్టోరియా రాణితో-ఆల్బర్టు అప్పుడప్పుడు తగాదాపడి - ఇలాగే బ్రతిమి లాడించుకొనే వాడట! ఎట్లాగయినా పురుషుడు పురుషుడే!' అను కున్నాడు వెంకటేశ్వర్లు.

ఆ గదిలోని సంభాషణను చివరవరకూ వినవలెనని వెంకటేశ్వర్లకు కుతూహలము కలిగి - తలుపుకు చెవి ఆనించి వినటము మొదలు పెట్టాడు.

"నేను ఇంటికి రావటము ఆలస్యమైనదని దాని కెంత కోపము వచ్చిందో చూశారా? నేను అక్కడికి వెళ్ళానన్న మాటే గాని-నా ప్రాణమంతా దీని మీదనే కొట్టుకొని పోయిందంటే నమ్మండీ...చూడండి. నేను బిస్కట్లు యిస్తే తీసుకోదుట.... దగ్గరికి రమ్మంటే రాదుట...పోనీ...మీరు దగ్గరికి పిలిచి కూర్చొబెట్టుకోండి. ముఖము చిన్నబుచ్చుకొని...ఆ మూలకు వెళ్ళి ఎట్లా నిలబడిందో చూడండి."

ఈ కంఠ ధ్వని వైద్యురాలిది. ఆమె ఎవరిని గురించి మాట్లాడుతున్నది? ఎవరితో మాట్లాడుతున్నది? వెంకటేశ్వర్లకు అర్థము కాలేదు.

"దా...దా...నాదగ్గరికిరా ... మమ్మీ మీద కోపము వచ్చిందా?"

ఇది స్పష్టముగా మగ గొంతు - డాక్టరు శర్మదయి ఉంటుందను కున్నాడు వెంకటేశ్వర్లు.

"అబ్బ! దీనికెంత కోపమనుకున్నారు? నేను హాస్పిటలకు వెళ్లుతూ మొన్న దీనిని కారులో కూర్చోపెట్టుకొని తీసుకొని వెళ్ల తున్నాను. అక్కడ నాతో కూడా పనిచేసే డాక్టరు తన కారు చెడి పోయిందని ఈ కారులో వస్తానంటే సరేనని ముందు సీటులో కూర్చోమన్నాను. ఆ స్థలము దీనిదట....ఎంత లాగినా అక్కడ

నుంచి రాక మారాము చేసింది. నేను బలవంతముగా ఎత్తుకొని నా ఒడిలో కూర్చో బెట్టుకున్నాను. ఆ కోపము మనసులో పెట్టు కొని ఆ రోజంతా నా దగ్గిరికి రాలేదు."

తరువాత ముద్దు పెట్టుకొన్న శబ్దము వినిపించింది వెంక టేశ్వర్లకు.

'అయితే.... ఊరివారందరికీ జన్మ నిరోధమును గురించి ఉపన్యాసాలిచ్చి-బిడ్డలను కనవద్దని ఉపదేశించిన డాక్టరు పంకజ వల్లీశర్మ ఇంట్లో చేసేది ఈ పనా? ఈమె కూడా పిల్లలను కన్నదికదా....' అని విస్మితుడైనాడు వెంకటేశ్వర్లు.

అంతలో కళ్లు జిగేలుమనే రంగుచీరె కట్టుకొని ప్రక్క-తలుపు తెరచుకొని బయటికి వస్తూ 'ఆలస్యమైనట్లుంది....రండి వెళ్లుదాము' అంటూ కారును సమీపించింది వైద్యురాలు.

'ఎంత వైద్యురాలైనా-స్త్రీలకు ఇంటి నుంచి బయటికి రావా లంటే ఎంతో సర్దుబాటు కావాలి' అని నవ్వుతూ వెంకటేశ్వర్లు అక్కడ నుండి కదిలి కారుదగ్గరికి వచ్చి 'నా సైకిలు ఇక్కడే ఉంచుతాను. తరువాత తెప్పించుకుంటాను' అని కారులో ముందు సీటులో కూర్చున్నాడు.

గదిలో నుండి వరెండాలోకి వచ్చి నిలువబడిన ఆయన డాక్టరు శర్మ అయి ఉంటాడు-ఎరుపు డాలుగల కుక్కను ఎత్తుకొని 'మమ్మీని చూడు....తొందరగా రమ్మని చెయ్యి ఊపు' అంటూ కుక్కను ముద్దు పెట్టుకుంటున్నాడు!

వెంకటేశ్వర్లకు కలిగిన ఆశ్చర్యానికి అంతులేదు. ఈ కుక్కపిల్లల సంతానముతో ఆనందిస్తూ తనను ఎంతసేపు వాకిట్లో నిలబెట్టిందీ వైద్యురాలు! బాగున్నది! అయినా...ఇద్దరూ బాగా సంపాదిస్తూ—మంచి ఆరోగ్యముగా ఉన్న దంపతులుకదా....ఈ కుక్క పిల్లలనూ కుందేలు పిల్లలనూ పెంచుతూ పిల్లల సరదా తీర్చుకోవటము ఏంకర్మము?' వెంకటేశ్వర్లు తనకు కలిగిన విస్మయమును దాచుకొనలేక ముఖము మీదికి కనబరచాడు.

తన కుక్కను చూచి సంతోష పడుతున్నాడనుకొని 'ఏమండీ! మా హైనీ స్వీట్‌గా లేదూ?' అని వెంకటేశ్వర్లను ప్రశ్నించి 'డార్లింగ్! టా....టా....' అంటూ చెయ్యి ఊపింది డాక్టరు పంకజవల్లీశర్మ.

డాక్టరు శర్మ తిరిగి 'టా....టా....' అంటూ కుక్క పిల్లి చేత చెయ్యి ఊపించాడు.

వైద్యదంపతుల సంతానపు ముచ్చటలను చూసి 'ఏమి నాగరీకము!' అనుకున్నాడు వెంకటేశ్వర్లు. అతడికా విస్మయములో భార్య ప్రసవవేదనను గురించిన తలంపులు కొంత సేపటి వరకూ దూరమైనవి!